క్లుప్తంగా

32 మందికి ఆధార్‌లో మార్పులు, చేర్పులు



ఫిరంగిపురం: నుదురుపాడు గ్రామ సచివాలయంలో గురువారం ఆధార్ నమోదు సెంటర్ ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి శౌరిజోజి తెలిపారు. కీలకమైన ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు సరిచేసుకునేందుకు వీలుగా ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. దానిలో భాగంగా ఆధార్‌లో అడ్రస్, పేరు, వయస్సు మార్పులకు సంబంధించి 32 మందికి నమోదు చేసినట్లు డిజిటల్ అసిస్టెంటు గణేష్ తెలిపారు. మరో రెండు రోజులు పాటు నిర్వహించే ఆధార్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఫణికి సత్కారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) దుగ్గిరాల మండల అధ్యక్షుడిగా నియమితులైన ఎన్‌డీవీ ఆర్ ఫణిని దుగ్గిరాల విలేజ్ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ అభినందన కార్యక్రమానికి ఫోరం కన్వీనర్ ఇంగువ విష్ణుమూర్తి అధ్యక్షత వహించారు. ముందుగా వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విష్ణుమూర్తి మాట్లాడుతూ యూటీఎఫ్ దుగ్గిరాల మండల అధ్యక్షుడిగా ఫణిని నియమించడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బొంత కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు భూ సర్వేపై సమీక్షా సమావేశం

మంగళగిరి: నగరంలో చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు పథకంపై శుక్రవారం ఉదయం 11 గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అడ్మిన్ సెక్రటరీలు, ప్లానింగ్ సెక్రటరీలు, ఎమినిటీ సెక్రటరీలు, సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ యు.శారదాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విభాగాల సెక్రటరీలు, విలేజ్ సర్వేయర్లు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

అంగన్‌వాడీ వర్కర్ల నిరసన



మంగళగిరి: తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు గురువారం నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు వేముల దుర్గారావు మాట్లాడుతూ యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా నగరంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించామన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు పిల్లలకు ఆట వస్తువులను ఏర్పాటు చేయాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు పెండింగ్ టీఏ, డీఏ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి వై.కమలాకర్‌తో పాటు పలువురు అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

కొలనుకొండలో ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా



తాడేపల్లిరూరల్: కొలనుకొండలో సుందరయ్య నగర్‌లో గురువారం తాగునీటి పైప్‌లైన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో వలంటీర్లు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన క్రాంతి కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి సుందరయ్య నగర్‌కు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. ఓహెచ్ ఆర్ ట్యాంక్ నుంచి సుందరయ్య నగర్‌కు వెళ్లే పైప్‌లైన్‌లో ఏదో అడ్డుపడటం వల్ల సుందరయ్య నగర్‌కు మంచినీటి సరఫరా తగ్గిందని, ఆ సమస్యను పరిశీలిస్తున్నామని ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతి తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి సుందరయ్యనగర్‌కు తాగునీటిని పునరుద్ధరించనున్నట్లు చెప్పారు.

అభివృద్ధి పథంలో పేరేచర్ల కైలాసగిరి

- శరవేగంగా పేరేచర్ల – కైలాసగిరి తారురోడ్డు నిర్మాణం
- శివరాత్రికి ముస్తాబవుతున్న కైలాసగిరి క్షేత్రం



కైలాసగిరి కొండపైకి నూతనంగా ఏర్పాటు చేసిన తారురోడ్డు

మేడికొండూరు: పేరేచర్లలోని కై లాసగిరి శైవక్షేత్రం అభివృద్ధి పథంలో సాగుతోంది. వచ్చే నెలలో జరగనున్న శివరాత్రి ఉత్సవానికి ప్రత్యేకంగా ముస్తాబవుతోంది. కొండపైకి తారురోడ్డు నిర్మాణం పూర్తయింది. దీంతో కార్లు, ద్విచక్ర వాహనాలు, మినీ బస్సులు కొండపైకి వెళ్లేందుకు మార్గం సుగమం అయిందని కై లాసగిరి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్, మేడికొండూరు జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరుకు కూతవేటు దూరంలో ఉండే కైలాసగిరిలో భక్తులకు అన్నిరకాల సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేవిధంగా ఇంకా మరికొన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మెట్లమార్గం అందుబాటులో ఉందని తెలిపారు. ఆలయ ముఖద్వార మండపం ప్రత్యేక హంగులతో నిర్మాణం జరుగుతున్నట్లు చెప్పారు. వచ్చేనెలలో జరగనున్న శివరాత్రి మహోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు కారుమూరి వెంకటేశ్వరరావు గుప్తా, కారుమూరి సాంబశివరావు గుప్తా, శ్రీకాకొలను లక్ష్మీనారాయణ, పెనుగొండ వీరాంజనేయులు, అమర ఉషస్‌కుమార్, శివప్రసాద్, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలి

ఎమ్మెల్యే ఆర్కేకు కేవీపీఎస్ నేతల వినతి



ఎమ్మెల్యే ఆర్కేకు వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్, దళిత ప్రజా సంఘాల నేతలు

మంగళగిరి: ఎస్సీ, ఎస్టీ జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కేవీపీఎస్, దళిత ప్రజా సంఘాల నేతలు గురువారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)ని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పొడిగిస్తూ అసెంబ్లీ తీర్మానం చేసేలా కృషి చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు కేటాయించి దళితుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను కొనసాగించాలని, దళిత, గిరిజన కాలనీల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు దళితుల శ్మశాన స్థలాల కొనుగోలుకు నిధులు కేటాయించాలని కేవీపీఎస్ నేతలు ఎమ్మెల్యే ఆర్కేకు అందించిన వినతిపత్రంలో పేర్కొన్నారు. కేవీపీఎస్ నేతలు నల్లపు కిషోర్ బాబు, బి.స్వామినాథన్, వై.కమలాకర్, జోసెఫ్, ఎస్.కోటేశ్వరరావు, కె.రాజారావు తదితరులు ఎమ్మెల్యే ఆర్కేను కలసి వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఎస్‌ఆర్‌ఎం విద్యార్థుల ప్రతిభ



జట్టుతో ఎస్‌ఆర్‌ఎం వైస్ చాన్సలర్ మనోజ్‌కుమార్ ఆరోరా, రిజిస్ట్రార్ ప్రేమ్‌కుమార్

మంగళగిరి: తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం పట్టణంలో ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు యూనివర్సిటీ విద్యార్థులకు జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో ఏపీ ఎస్‌ఆర్‌ఎం బాలురు జట్టు రన్నర్స్‌గా నిలిచింది. సెమీఫైనల్స్‌లో ఖమ్మం జట్టుపై 3–2 పాయింట్ల తేడాతో విజయం సాధించిన ఏపీ ఎస్‌ఆర్‌ఎం జట్టు ఫైనల్స్‌లో సర్వీసెస్ జట్టుతో తలపడి ఐదు పాయింట్ల తేడాతో ఓటమిపాలై ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ ట్రోఫీని దక్కించుకుంది. రెండు రాష్ట్రాలకు చెందిన 42 జట్లు పోటీల్లో పాల్గొనగా ఎస్‌ఆర్‌ఎం జట్టు ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ ఆధికృతను కనబర్చింది. జట్టు కెప్టెన్ గణేష్ సారథ్యంలో క్రీడాకారులు జ్ఞానసాయి, కిరణ్, వివేక్, భరద్వాజ్, యశ్వంత్, భువనేష్ జట్టును విజయపథాన నడిపించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల బృందానికి నేతృత్వం వహించిన యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ విజయ్‌కుమార్ ఉపాధ్యాయ, మేనేజర్ అబ్దుల్ మోమిన్‌ను, క్రీడాకారులను యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరా, రిజిస్ట్రార్ ప్రేమ్‌కుమార్ అభినందించారు.

విభజన హామీలను నెరవేర్చాలి

- బీఆర్‌ఎస్, బీజేపీకి ఆంధ్రలో స్థానం లేదు
- నాన్‌పొలిటికల్ జేఏసీ కన్వీనర్ అప్పికట్ల శ్రీహరినాయుడు

మంగళగిరి: రాష్ట్రాన్ని విడగొట్టిన అనంతరం విభజన హామీలు నెరవేర్చకుండా రాష్ట్రంలో తిరిగే హక్కు బీఆర్‌ఎస్, బీజేపీకి లేవని నాన్‌పొలిటికల్ జేఏసీ కన్వీనర్ అప్పికట్ల శ్రీహరినాయుడు అన్నారు. నగరంలోని ఐబీఎస్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాష్ట్రానికి అన్యాయం చేస్తోందన్నారు. విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్ ప్రకటించాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ 9, 10, 13లో పొందుపర్చిన అన్ని సంస్థలను వెంటనే రాష్ట్రంలో నెలకొల్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటా, నిధులను కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకుని వెంటనే విడుదల చేయించాలని కోరారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ ఆపడంతో పాటు కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలో పొందుపర్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆరేపల్లి మణికంఠ, గొడవర్తి కోటేశ్వరరావు, ఇ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో చలపతి విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, విద్యార్థులు

మోతడక(తాడికొండ): ట్యాప్ అకాడమీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో తమ కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ట్రైనీ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రంగారావు తెలిపారు. కంపెనీకి చెందిన హెచ్‌ఆర్ బృందం ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు రాత పరీక్ష, రీజనింగ్, అర్థమెటిక్, టెక్నికల్, జస్ట్ ఏ మినిట్, ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా 11 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.3.5 లక్షలు ఇస్తారని, బెంగళూరులో ఉన్న సంస్థలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వై.సుజిత్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ నాగశ్రీనివాసరావు, ఉపాధి కల్పనాధికారులు ఎ.శ్రీనివాస్, పి.గాంధీ, వివిధ విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దు

సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ



సర్టిఫికెట్ అందజేస్తున్న సబ్ కలెక్టర్

తెనాలి టౌన్: నేటి యువత ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దని, వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. పట్టణ గాంధీ చౌక్‌లో చందూస్ జిమ్‌లో గురువారం రాత్రి జరిగిన 12వ వార్షికోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిమ్ మేనేజింగ్ డైరెక్టర్ చందు వెంకటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. సభలో సబ్ కలెక్టర్ జిమ్ ఆవశ్యకత, ఆరోగ్యంపై ప్రభావం తదితర అంశాల్ని వివరించారు. జిమ్‌లో కొన్ని విభాగాలు అయిన చెస్ట్ ప్రెస్, బ్యాక్ స్క్వాడ్, ప్లాంక్ విభాగాల్లో చాంపియన్‌షిప్‌లు సాధించిన మహిళలు, పురుషులకు మెడల్స్, సర్టిఫికెట్లను సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జెవీఎం హాస్పిటల్ ఎండీ డాక్టర్ జె.కోటినాగయ్య, అమ్మ హాస్పిటల్ ఎండీ శివప్రసాద్, జిమ్ ఎండీ చందు వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో ప్రసాద్‌బాబు, విజయ్, మస్తాన్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

షటిల్ పోటీల్లో సంజయ్, అరవింద్ సత్తా

తెనాలి అర్బన్: మండలంలోని కొలకలూరులో కిస్టా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అంతర్ జిల్లాల షటిల్ పోటీల్లో బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాల విద్యార్థులు ఎ.సంజయ్, ఎ.అరవింద్ (బాలుర డబుల్స్ విభాగంలో) ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. పాఠశాల ఆవరణలో గురువారం వీరికి స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మెమెంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి గురైన మోటార్ల గుర్తింపు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెనుమాక పంట పొలాల్లో ఈ నెల 12వ తేదీ విద్యుత్ మోటార్లు చోరీకి గురికావడంతో రైతులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి తమ మోటార్లు ఎక్కడ ఉన్నాయా? అని వివిధ ప్రాంతాల్లో పాత ఇనుప సామగ్రి కొట్లలో వెతుకుతుండగా గురువారం ఆ మోటార్లు ఎక్కడ ఉన్నాయో కనుక్కొని తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైతుల ద్వారా సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు విజయవాడలో బీఆర్‌టీఎస్ రోడ్డులో ఉన్న ఓ పాత ఇనుప సామాన్ల దుకాణంలో ఉంచిన మోటార్లను రికవరీ చేసి ఆ షాపు యజమానిని విచారిస్తున్నారు. ఈ నెల 13వ తేదీ రైతులమంటూ మా పొలాల్లో సబ్ మెర్సిబుల్ మోటారు బిగించామని, ఈ రెండు మోటార్లను 9 వేల రూపాయలకు వారు అమ్మినట్లు దుకాణం యజమాని తెలియజేశాడు. పోలీసులు షాపు యజమానిని అదుపులోకి తీసుకుని షాపులో ఉన్న సీసీ కెమెరా పుటేజీలను తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

మహిళకు గాయాలు

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలో ఓ మహిళకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గాయపడిన సంఘటనపై గురువారం తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కొలనుకొండకు చెందిన ఇసుకపల్లి సాధన (పండు) బుధవారం రాత్రి వేడినీళ్లు కాచి బకెట్‌లోకి పోస్తుండగా, ప్రమాదవశాత్తు ఆమె వేసుకున్న నైటీకి పొయ్యిలోని నిప్పంటుకుంది. మంటలు చెలరేగి కాళ్ల దగ్గర నుంచి పొట్టవరకు కాలింది. గాయపడిన ఆమెను భర్త జాన్‌బాబు వైద్యం కోసం విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై భర్త జాన్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన రాము, ఆచప్ప

మేడికొండూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన డోగిపర్రు అడ్డరోడ్డు వద్ద గురువారం జరిగింది. మిరియాలగూడకు చెందిన ఆచప్ప గొర్రెలు మేపేందుకు వలస వచ్చాడు. డోగిపర్రు బ్రిక్స్ కంపెనీ వద్ద ఉంటున్నాడు. నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు పేరేచర్ల వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా, ఈ నేపథ్యంలో గుంటూరుకు చెందిన రాము ద్విచక్ర వాహనంపై పేరేచర్ల వైపు వస్తున్నాడు. మార్గంలో ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాము, ఆచప్పకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనం సహాయంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంఘిక నాటక కళాకారుడు బాలస్వామికి సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం 'సింహం నవ్వింది' చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం 'సామ్రాట్ అశోక' చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ సాంఘిక నాటక కళాకారుడు తుంగా బాలస్వామిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శుద్దపల్లి శివసత్యనారాయణ, శుద్దపల్లి రామయ్య, శుద్దపల్లి కోటేశ్వరరావు, ముత్తే కృష్ణారావు, ముత్తే వెంకటేశ్వరరావు, చెరుకుమల్లి సింగారావు, ఉయ్యూరి ఉమామహేశ్వరరెడ్డి, బాల సుందర్, కేసన కోటేశ్వరరావు, పెమ్మసాని పోతురాజు, దేవరపల్లి భవాని, అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, కొండమూది రమేష్, తుంగా సుబ్బారావు, ప్రసాద్, పెద్ద శవరయ్య, చిన్న శవరయ్య, నాగరాజు, శంకర్, రవి, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేమన సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలి



వేమనకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్

ఫిరంగిపురం: వేమన సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. మండలంలోని హౌస్‌గణేష్ గ్రామ శివారులోని కొండవీటి రెడ్డిరాజుల మ్యూజియంలో గురువారం అఖిల భారత రెడ్ల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజాకవి యోగి వేమన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకవి వేమన అన్నారు. సమాజంలో మార్పు రావాలని సరళమైన పద్యరూపంలో వివరించిన మహాకవి అని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు యాభై శాతం పదవులు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేమన జయంతిని ప్రభుత్వ ప్రత్యేక రోజుగా పరిగణించి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేమన వారసుడే గుర్రం జాషువా అని చెప్పారు. ఆయన తన మాటల్లో మా తాత వేమన అని చెప్పుకునే వారని తెలిపారు. సమాజంలో అందరూ బాగుండాలని చెప్పిన మహోన్నత ఆధ్యాత్మికవేత్త యోగి వేమని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, అఖిల భారత రెడ్డి సమాఖ్య సభ్యులు, చిట్టా అంజిరెడ్డి, టి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భూ రీసర్వేపై గ్రామ సభ



భూ రీసర్వేపై అవగాహన కల్పిస్తున్న దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలో భూ రీసర్వేపై దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడా చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకాన్ని అమలు చేస్తోందని, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి అధికారులే మీ దగ్గరకు వచ్చి మీ భూముల కొలతలు వేసి బౌండరీ రాళ్లను ఏర్పాటు చేసి రైతులకు హక్కు పత్రాలను అందజేస్తున్నారని తెలిపారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమం చేపట్టిందని, ప్రజలు దీనిని ఉపయోగించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో గ్రామ వైస్ ప్రెసిడెంట్ ఫణీంద్ర, పంచాయతీ కార్యదర్శి రామలింగేశ్వరరావు, గ్రామ రెవెన్యూ అధికారి ఫకీర్, గ్రామ వలంటీర్లు, గ్రామ రెవెన్యూ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలని రైతుల వినతి

తాడికొండ: పేరేచర్ల మేజర్ కాలువ సమస్యను పరిష్కరించాలని నియోజకవర్గ రైతులు తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్‌ను కలిసి విన్నవించారు. ఈ మేజర్ కాలువ కింద 17 గ్రామాలకు చెందిన రైతులు సాగునీటిని వినియోగించుకొని మిర్చి సాగు చేస్తున్నారని, రైతులకు ఇబ్బందులు తొలగేలా చివరి భూముల వరకు సాగునీరు అందేలా పూడిక తీయించాలని కోరారు. స్పందించిన కత్తెర సురేష్ కుమార్ కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన అనంతరం సమస్యపై చర్చించారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన కోరగా, స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులను సత్వర పరిష్కారం దిశగా ఆదేశించారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నివాసరావు, మందిర వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

పాత గుంటూరు: సంగడిగుంట లాంచెస్టర్ రోడ్డు 7వ లైనులోని శ్రీ సీతారామస్వామి మందిరంలో ఈనెల 20వ తేదీ నుంచి 24 వరకు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మందిర వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కందిమళ్ల సాంబశివరావు, కార్యదర్శి కల్లి సుందరరామిరెడ్డి తెలిపారు. మందిర ఆవరణలో గురువారం మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో సుందరరామిరెడ్డి మాట్లాడారు. 20న సాయంత్రం 5 గంటలకు శ్రీవారి గ్రామోత్సవంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 6 గంటల నుంచి విశేష పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 21న ఉదయం 8 గంటల నుంచి వేద పారాయణాలు, యంత్ర పునఃశ్చరణ, హోమం, విశేష పూజా కార్యక్రమాలు, 22న ఉదయం 8 గంటల నుంచి వేద పారాయణాలు, ఏకాశీతి, పంచవింశతి, నవకలశ స్థాపన, తీర్థప్రసాద గోష్ఠి, 23న ఉదయం 6 గంటల నుంచి వేద పారాయణాలు, విశేష హోమాలు, 9.59 నిమిషాలకు బింబ స్థాపన (విగ్రహ ప్రతిష్ట) అనంతరం పూర్ణాహుతి, అన్న సంతర్పణ ఉంటుందని తెలిపారు. 24న ఉదయం 10 గంటలకు శాంతి కల్యాణం, మహదాశీర్వచనం, ఆచార్యసంభావనం జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, సభ్యులు వెంకటేశ్వరరావు, రామశంకరరావు, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి

విట్ చాన్సలర్ డాక్టర్ జి. విశ్వనాథన్



సమావేశంలో ప్రసంగిస్తున్న వెల్లూరు విట్ చాన్సలర్ విశ్వనాథన్

ఏఎన్‌యూ: వ్యక్తి, కుటుంబం, సమాజం సర్వతోముఖాభివృద్ధికి విద్యే మార్గమని వెల్లూరు విట్ చాన్సలర్, మాజీ మంత్రి డాక్టర్ జి. విశ్వనాథన్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్వనాథన్ ప్రసంగిస్తూ మన సమాజంలో పేదరికం, అసమానతలు పెరగడానికి విద్య లేమి ప్రధాన కారణమన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశం నేటికీ పేదరికంతో కొట్టుమిట్టాడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ దేశమైనా అభివృద్ధి చెందితే, అక్కడి ప్రజలందరూ అభివృద్ధి చెందుతారని కానీ మన దేశంలో అలా జరగడం లేదని తెలిపారు. ప్రతి వ్యక్తికీ జీవితంలో క్రమశిక్షణ, సహాయం చేసే తత్వం చాలా ముఖ్యమని, అవి లేకపోతే చాలా కోల్పోతామని తెలిపారు. విద్యార్థులు ఇంటర్మీడియెట్ తరువాత మూడు సంవత్సరాల కాలం చాలా క్రమశిక్షణతో మెలగాల్సిన అవసరం ఉందని సూచించారు. ఒక వ్యక్తి ఉన్నతంగా ఉండటంలో అతని ఆరోగ్యం, అలవాట్లు ఎంతో కీలకమని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యను కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు. విద్యా సంస్థ ప్రగతి, విద్యార్థుల భవిష్యత్‌లో గురువుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ప్రసంగిస్తూ విద్యార్థులు తమ విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తే వారి జీవితం ఉన్నతంగా రూపొందుతుందన్నారు. ఏఎన్‌యూలో ప్రతి విభాగంలో ఒక సెమిస్టర్‌కు కనీసం పది మంది విదేశీ అధ్యాపకులు, నిపుణులతో విద్యార్థులకు బోధన చేయించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విట్ ఏపీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎస్.వి. కోటారెడ్డి ప్రసంగిస్తూ కష్టపడకుండా ప్రత్యామ్నాయం లేదనేది విద్యార్థులు గుర్తించాలన్నారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఓఎస్‌డీ ఆచార్య సునీత, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్ధయ్య , డీన్ ఆచార్య ఈ శ్రీనివాసరెడ్డి, పలువురు ప్రిన్సిపాల్స్ ప్రసంగించారు. ఏఎన్‌యూ, విట్ సంస్థల మధ్య ఎంఓయూ(అవగాహనా ఒప్పందం) పత్రాల్ని ఏఎన్‌యూ వీసీ ఆచార్య రాజశేఖర్, విట్ చాన్సలర్ డాక్టర్ విశ్వనాథన్ మార్చుకున్నారు.